క్లుప్తంగా

గ్రామసేవలో భాగస్వాములు కావాలి


మాట్లాడుతున్న రవీంద్రబాబు

ఎల్.ఎన్.పేట: గ్రామ సేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని భగవాన్ సత్యసాయి సేవా సంస్థల జిల్లా ఇన్‌చార్జి మునగవలస రవీంద్రబాబు కోరారు. శ్యామలాపురం గ్రామంలోని సత్యసాయి భజన మండలి కన్వీనర్ ఎ.నారాయణరావు ఆధ్వర్యంలో ఆదివారం సత్యసాయి మందిరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ సేవ రామ సేవతో సమానంగా పేర్కొన్నారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభను పెంచేందుకు, ప్రతీ ఒక్కరిలోను ఆధ్యాత్మిక భావాలను కలిగించేందుకు, వారిని ఆధ్యాత్మికత వైపు నడిపించేందుకు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో యువతను గుర్తించి వారికి స్వయం ఉపాధి నైపుణ్యాలను పెంచేలా సత్యసాయి సేవా సంస్థలు శిక్షణలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో జరగనున్న ప్రశాంత యాత్రకు సిద్ధం కావాలని సత్యసాయి భక్తులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హిరమండలం జోనల్ కన్వీనర్ బెహరా సురేష్ పట్నాయక్, బాలవికాస్ గురువులు, సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు


తోటవాడలో పశువులకు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యాధికారి వెంకటరావు


బూర్జ: పశువులకు వ్యాధులు సోకకుండా ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలను వేస్తున్నట్టు కొల్లివలస పశువైద్యశాఖాధికారి డాక్టర్ జి.వెంకటరావు అన్నారు. పశువైద్యకేంద్రంలో విలేకరులతో ఆదివారం మాట్లాడారు. వర్షా కాలం సమీపిస్తున్న నేపథ్యంలో వ్యాధులు సోకకుండా పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలకు రైతు భరోసా కేంద్రాలలో పని చేస్తున్న పశు సంవర్ధక సహాయకుల ద్వారా ఆయా పరిధిలో ఉన్న గ్రామాలలో టీకాలు వేస్తున్నట్టు వివరించారు. ఆవులు, గేదెలకు జబ్బవాపు వ్యాధిరాకుండా ముందస్తుగా బీక్యూ (బ్లాక్ క్వార్టర్) వ్యాక్సిన్ వేస్తున్నామన్నారు. అలాగే గొర్రెలు, మేకలకు చిటుక వ్యాధి రాకుండా ఈటి (యాంటీ రోట్యోక్సీమియా) వ్యాక్సిన్ వేస్తున్నట్టు చెప్పారు.

ఎంఆర్సీకి చేరిన పాఠ్యపుస్తకాలు


ఎంఆర్సీకి చేరిన పాఠ్య పుస్తకాలు

సారవకోట: మండల కేంద్రంలో ఉన్న ఎంఆర్సీకి పాఠ్య పుస్తకాలు వచ్చి చేరుతున్నాయి. ఈ ఏడాది నేరుగా ప్రింటర్స్ నుంచి మండల కేంద్రాలకు చేరే అవకాశం కల్పించారు. శని, ఆదివారాలలో మండల కేంద్రంలోని ఎంఆర్సీకి 8,500 8, 9వ తరగతులకు చెందిన పుస్తరాలు చేరాయి. వీటిని పాఠశాలలు పునః ప్రారంభమైయ్యే రోజునే విద్యార్థులకు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు


అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ఆమదాలవలస రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చదువుకోవడానికి కావాల్సిన అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని వెదుళ్లవలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి నారాయణరావు అన్నారు. ఈ పాఠశాల పరిధిలో బడిబయట ఉన్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పొందాలని కోరుతూ తల్లిదండ్రులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు రజిని పాల్గొన్నారు.

• కార్డన్ సెర్చ్


బూర్జ మండలం కొరగాం గ్రామంలో స్థానిక పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి ఎస్సై ఆమదాలవలస–2 ఐ.నాగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది కార్డన్ సెర్చ్, ఫ్లాగ్‌మార్చ్‌ను ఆదివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సోదాలు చేశారు. వివాదాస్పద, అనుమానితుల గురించి ఆరా తీశారు. పశువుల శాలలు, గడ్డివాములను సైతం క్షుణ్ణంగా పరిశీలించారు. 52 ద్విచక్ర వాహనాల రికార్డులను పరిశీలించారు. ఎటువంటి రికార్డులు లేని ఐదు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. -బూర్జ

• కల్యాణ వైభోగం


పురుషోత్తపురం గ్రామ భూనీలాసమేత లక్ష్మీవెంకటేశ్వరస్వామి వారి 24వ వార్షిక కల్యాణ మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. వేదపండితులు తమ్మినేని కోదండరామ స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి విశ్వక్సేనపూజ, ధ్వజారోహణం, పండితపరిషత్, సహస్రనామార్చనలు చేశారు. దివ్యముహూర్తాన స్వామి వారి దివ్యతిరుక్కల్యాణం నిర్వహించారు. అర్చకులు నానుపాత్రుని రామమూర్తి, గుర్నాథరావు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. -సరుబుజ్జిలి

• సాహిత్య సేవకుడికి సత్కారం


పొందూరు మండలం వావిలపల్లిపేటకు చెందిన స్కూలు అసిస్టెంట్, శ్రీశ్రీ జాతీయ కళా వేదిక జిల్లాశాఖ ప్రధాన కార్యదర్శి వావిలపల్ల రాజారావుకు ఆదివారం విజయవాడలోని హనుమంతురావు గ్రంథాలయంలో ఘనంగా సత్కరించారు. తెలుగు భాష, సాహిత్యాలకు విశిష్ట సేవలందించినందుకు విజయవాడలోని తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ సత్కరించి గౌరవించింది. సంస్థ అధ్యక్షుడు, విశ్రాంత ప్రధానాచార్యులు డాక్టర్ యూవీ రత్నం స్వర్ణ పతకాన్ని, ప్రశంసాపత్రాన్ని ప్రదానం చేసింది. రాజారావు మాస్టారు నాదేశం, ఎందరో మహానుభావులు, మహోన్నత శిఖరాలు వంటి పుస్తకాలను రాశారు. -పొందూరు

శాంతిభద్రతల పరిరక్షణ అందరి బాధ్యత


ఆమదాలవలస:ఐజెనాయుడు కాలనీలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ విజయ్‌కుమార్

ఆమదాలవలస: శాంతిభద్రతల పరిరక్షణ ప్రజలందరి బాధ్యత అని, విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పి బి.విజయ్‌కుమార్ అన్నారు. మున్సిపాలిటీ 14వవార్డు ఐజేనాయుడు కాలనీ, 9వవార్డు పరిధి మెట్టక్కివలసలో ఆమదాలవలస ఎస్ఐ కె.వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనలు, చట్టాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఎన్నికలు వస్తుంటాయి.. పోతుంటాయని చిన్నపాటి మనస్పర్థలతో జీవితాలు కోల్పోవద్దని సూచించారు. కలిసిమెలిసి జీవించాలని, తగాదాలకు పాల్పడవద్దని అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఎన్నికల సంఘ నిభందనలు ప్రకారం ఫలితాల రోజున బాణాసంచా పేలుళ్లు, ర్యాలీలు, ఊరేగింపులు కు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఇద్దరు ,ముగ్గురు కంటే గుమ్మిగూడి ఉండరాదన్నారు.అనంతరం పట్టణంలో ప్రధాన రహదారిపై పోలీసు బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దు

సరుబుజ్జిలి: శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రజలు వ్యవహరించాలని శ్రీకాకుళం(ఎస్సీ, ఎస్టీ సెల్) డీఎస్పీ విజయ్‌కుమార్ సూచించారు. మండలంలోని రొట్టవలస గ్రామంలో ఆదివారం పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నామని, ప్రజలు సమావేశాలు, సభలు నిర్వహించరాదని, సమూహాలుగా ఉండరాదని స్పష్టం చేశారు. మద్యం అక్రమనిల్వలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక ఎస్సై నిహార్ పాల్గొన్నారు.


సరుబుజ్జిలి:ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న పోలీసులు


ఆమదాలవలస: పట్టణంలో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న పోలీసులు

కౌంటింగ్ ఏజెంట్లు బాధ్యతగా ఉండాలి



మాట్లాడుతున్న కృష్ణదాస్

• ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: ఈ నెల నాలుగో తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ప్రతీ టేబుల్ వద్ద ఉండే ఏజెంటు బాధ్యతగా, అలెర్ట్‌గా ఉండాలని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నరసన్నపేటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కౌంటింగ్‌కు వెళ్లే ఏజెంట్లతో ఆయన ఆదివారం మాట్లాడారు. ప్రతీ ఓటు కీలకమన్నారు. మనకు పడిన ప్రతీ ఓటునూ వైఎస్సార్ సీపీ అభ్యర్థికి దక్కేలా చూడాలన్నారు. ప్రధానంగా పోస్టల్ బ్యాలెట్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పోస్టల్ బ్యాలెట్లు కౌంటింగ్ కోసం నాలుగు టేబుళ్లను అధికారులు ఏర్పాటు చేశారని.. వీటి వద్ద ఉన్న ఏజెంట్లు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న పోస్టల్ బ్యాలెట్లను కౌంటింగ్‌లోనికి రాకుండా చూడాలన్నారు. నియోజకవర్గ ప్రతినిధి శాస్త్రి కౌంటింగ్ ఏజెంట్లకు పలు సూచనలు చేశారు. సమావేశంలో నాయకులు గుప్త, ధర్మాన జగన్, నక్క తులసీదాస్, కణిత కృష్ణ, లుకలాపు రవి, పాగోటి రాజారావు ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


పాతపట్నం: వ్యాచరచన పోటీల్లో విద్యార్థులు

పాతపట్నం: వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని పాతపట్నం శాఖాగ్రంథాలయాధికారి కాళ్ల రాజు అన్నారు. స్థానిక శాఖాగ్రంథాలయంలో ఆదివారం వ్యక్తిత్వ వికాసంలో భాగంగా గ్రంథాలయాల పాత్ర అనే అంశంపై వ్యాచరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే విద్యార్థులకు పోటీతత్వం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పి.ఆనందరావు, వి.బెనర్జీ, పాఠకులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: వేసవిలో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని స్థానిక శాఖా గ్రంథాలయ అధికారి అనురాధ అన్నారు. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. విద్యార్థుల మానసిక వికాసానికి, పుస్తకాలు మూలస్తంభాలుగా నిలుస్తాయన్నారు. చిత్రలేఖనం ద్వారా చక్కటి ప్రతిభ పెరుగుతోందన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మగ్గం శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న దృశ్యం

నరసన్నపేట: మహిళలు స్వయంశక్తితో ముందుకెళ్లి వారి కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్కిల్ డవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు చెప్పారు. నరసన్నపేటలో ఇప్పటికే రెండు విడతల్లో 136 మందికి మగ్గం నేతపై శిక్షణ ఇచ్చామని.. తాజాగా మూడో విడత శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తామన్నారు. శిక్షణ పొందిన మహిళలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం 68 మందికి శిక్షణ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఒక మంచి ఆశయంతో చేపట్టిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. స్థానిక సాయి పెద్ద మందిరంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ పి.నాగేశ్వరరావు, మహిళా కోఆర్డినేటర్ అమ్మాయమ్మ, సత్యసాయి సేవా సమితికి చెందిన వివిధ విభాగాల ప్రతినిధులు ఎస్.ఆదినారాయణ గుప్త, బోయిన నర్సింహమూర్తి, వీఎస్ఎస్ మూర్తి, వి.నాగేశ్వరరావు, రామ్మోహనరావు, కుసుమ ఉన్నారు.

సజావుగా పింఛన్ల పంపిణీ


నరసన్నపేటలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ తదితరులు

నరసన్నపేట: మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ సక్రమంగా జరిగిందని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. మండలంలో 11 వేల పింఛన్లు మంజూరు కాగా వీరిలో బ్యాంకు ఖాతాలు లేని లబ్ధిదారులు 2,707 మంది ఉన్నారన్నారు. వీరికి నేరుగా సచివాలయ సిబ్బంది వారి ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారన్నారు. మండలంలో 97 శాతం పూర్తి చేశామన్నారు. అలాగే ఖాతాల్లో పింఛన్ మొత్తాన్ని పింఛన్ దారులు సక్రమంగా తీసుకొనే విధంగా తగిన ఏర్పాట్లు చేశామని.. సంబంధిత బ్యాంకు సిబ్బందికి తగు సూచనలు చేశామన్నారు.

బాత్‌రూములో జారిపడి వ్యక్తి మృతి


లక్ష్మయ్య మృతదేహం

బూర్జ: బాత్‌రూములో జారిపడి వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన అన్నంపేట పంచాయతీ పరిధిలో ఉన్న కోళ్ల పౌల్ట్రీలో శనివారం చోటుచేసుకోగా.. బూర్ల లక్ష్మయ్య (53) ప్రాణాలు కోల్పోయాడు. లక్ష్మయ్యది సరుబుజ్జిలి మండలం యరగాం గ్రామం. పౌల్ట్రీలో పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. కుమార్తె బొద్ద రాజేశ్వరి ఫిర్యాదు మేరకు బూర్జ పోలీసు స్టేషన్ ఇన్‌చార్జి.. ఆమదాలవలస ఎస్సై–2 ఐ.నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించారు.

పాతపట్నంలో భారీ వర్షం


పాతపట్నంలో వర్షం పడుతున్న దృశ్యం


నరసన్నపేట పాతబస్టాండ్‌లో వర్షం కురుస్తున్న దృశ్యం

పాతపట్నం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోతతో జనం అవస్థలు పడ్డారు. అయితే రాత్రికి వర్షం పడడంతో ఉపశమనం పొందారు. మూడు నెలలుగా మహేంద్రతనయా నది, చెరువుల్లో నీరులేకపోవడంతో పశువులకు, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పలేదు. పాతపట్నంలో కుండపోత వర్షం కురియడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మార్కెట్ రోడ్డుపై వర్షం నీరు నిలిచిపోయింది. గంటన్నరసేపు కురిసిన వర్షంతో ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగింది. కొరసవాడ, కాగువాడ, బురాగాం తదితర గ్రామాల్లో పంట పొలల్లో నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: పగలంతా ఉక్కపోతతో తీవ్ర అవస్థలు పడిన ప్రజలు ఆదివారం సాయంత్రం మండల వ్యాప్తంగా కురిసిన వర్షంతో చల్లబడ్డారు. రాత్రి 7.30 గంటల సమయం నుంచి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో మేజరు పంచాయతీ నరసన్నపేటలోని లోతట్టు వీధులు జలమయమయ్యాయి. రోడ్లపై వర్షం నీరు పారింది. శివనగర్ కాలనీలో రోడ్లు, మెయిన్ రోడ్డు నీటితో నిండిపోయాయి. ఈ వర్షంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనులు చేపట్టేందుకు అనుకూలమని అంటున్నారు. ఈదురుగాలులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

శిథిలావస్థలో జీసీసీ రేషన్ డిపోలు!


శిథిలావస్థలో ఎస్.ఎస్.మనుగు జీసీసీ రేషన్ డిపో

పాతపట్నం: మండలంలోని లాబర, బైదలాపురం, ఎస్.ఎస్.మనుగు జీసీసీ రేషన్ డిపోలు శిథిలావస్థకు చేరాయి. పైకప్పు రేకులు పూర్తిగా పాడయ్యాయి. గోడలు బీటలు వారాయి. చిన్నవర్షపు జల్లు కురిసినా గదుల్లోకి నీరుచేరి నిత్యావసర సరుకులు తడిసిముద్దవుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేయకపోవడం వల్లే ఈ దుస్థితికి చేరాయని స్థానిక గిరిజనులు వాపోతున్నారు. లాబర డీపోకు నిధులు మంజూరైనప్పటికి భవనం నిర్మాణం కాలేదు. ఇప్పిటికైనా ఐటీడీఏ అధికారులు స్పందించి జీసీసీ డిపోలను బాగుచేయాలని కోరుతున్నారు.

శివసాగర్ బీచ్‌లో 'మిరాజ్' సినిమా సందడి


చిత్ర యూనిట్‌ను సన్మానిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని అక్కుపల్లి శివసాగర్ తీరంలో ఆదివారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. కె.ఎం.సి. ఫిలింమేకర్స్ బ్యానర్‌పై విష్ణుదేవ్ రచన, దర్శకత్వంలో తెలుగు, ఒడియా భాషలలో తెరకెక్కనున్న మిరాజ్ సినిమా చిత్రీకరణకు ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కుమార్ నాయక్ తొలి సన్నివేశానికి క్లాప్ కొట్టారు. ఈ మేరకు స్థానిక నీలకంఠేశ్వర స్వామీ ఆలయంలో చిత్రయూనిట్ ప్రత్యేక పూజలు చేసి పలు సన్నివేశాలను చిత్రీకరించారు. సస్పెన్స్, యాక్షన్, మిస్టరీ ప్రధానాంశాలుగా చిత్రీకరిస్తున్న ఈ చిత్రానికి ప్రముఖ పారిశ్రామికవేత్త కె.సత్యభాస్కర్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. డీఓపీగా మీర ఆలీఖాన్, మేనేజర్‌గా ప్రదీప్, కొరియోగ్రఫర్‌గా పత్రి తాతారావు, నటీనటులుగా కొంచాడ జీవన్‌బోటు, సుదిప్త, దదిప్తిరేఖ , దుర్గభవాని, రమేష్ యాదవ్, నారాప్రసాద్, బమ్మిడి కృష్ణారావు, లంక చిన్నంనాయుడు, లక్ష్య, అంకిత, డీఏ స్టాలిన్, మూల తాతయ్య తదితరులు నటిస్తున్నారు.

తొలకరి పనులు ప్రారంభం


బైదలాపురంలో నారుమడిని తయారు చేస్తున్న రైతు

పాతపట్నం: అన్నదాతలు తొలకరి పనులకు సిద్ధపడుతున్నారు. ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉన్నా, వర్షాలు పడుతుండడంతో రైతులు ఖరీఫ్ పనులకు దిగారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు నారుమడులు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం దుక్కులు జోరుగా జరుగుతున్నాయి. వ్యవసాయంలో యాంత్రీకరణ జోరందుకోవడంతో ప్రతి పనికీ యంత్రాలపై ఆధారపడుతున్నారు. దుక్కు పనుల్లో రైతులు నిమగ్నమై ఉన్నారు.

చెరువును కమ్మేసిన గుర్రపుడెక్క


చెరువులో గుర్రపుడెక్క

సరుబుజ్జిలి: కొత్తకోటలోని పెద్దచెరువును గుర్రపుడెక్క కమ్మేసింది. కొత్తకోట గ్రామం ఎగువ భాగాన 175 ఎకరాల విస్తీర్ణంలో గల పెద్దచెరువు చుట్టూ గల భౌగోళిక స్థితిగతులను అంచనాలు వేసిన వంశధార అధికారులు మినీరిజర్వాయర్‌గా అభివృద్ధి చేసేందుకు నిర్ణయించుకున్నారు. రిజర్వాయర్‌లో నీటిని స్టోరేజ్ చేయాలంటే సుమారు పది అడుగులు లోతు ఉండాలి. ప్రస్తుతం పూడికతీతలేక రిజర్వాయర్ మైదానాన్ని తలపిస్తున్నది. దీంతో సాగునీరు నిల్వచేయక వృథాగా బయటకు పోతుంది.

విక్రయానికి సిద్ధంగా పైనాపిల్


మురగడలోవ గిరిజన గ్రామంలో అమ్మకానికి సిద్ధం చేస్తున్న పైనాపిల్

ఎల్.ఎన్.పేట:ఈ ఏడాది పైనాపిల్ సీజన్ ముందే వచ్చింది. వాణిజ్య పంటల్లో భాగంగా గిరిజనులు కొండ పోడుగా సాగు చేసే పైనాపిల్ పంట ఈ ఏడాది ఆశాజనకంగా ఉందని గిరిజనులు చెబుతున్నారు. వాస్తవంగా జూన్ నెలాఖరు నాటికి దిగుబడి అందివస్తుందని..అయితే ఈ ఏడాది దిగుబడులు ముందే వచ్చాయని గిరిజన రైతులు చెబుతున్నారు. ఒక్కో పండును రూ.15 నుంచి 20 రూపాయల వరకు విక్రయిస్తున్నామని గిరిజనులు తెలిపారు.